క్లుప్తంగా

వీఎస్‌యూలో జాబ్‌మేళా


జాబ్‌మేళాకు హాజరైన విద్యార్థులు

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో గురువారం బాలాజీ ప్లేస్‌మెంట్స్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు దాదాపు 150 మంది విద్యార్థినీ, విద్యార్థులు హాజరు కాగా, వారిలో 80 మంది పలు కంపెనీల్లో ఉద్యోగాలు పొందినట్లు వీఎస్‌యూ ప్లేస్మెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ సాయి స్రవంతి తెలిపారు. ఈ జాబ్‌మేళాకు టెక్ మహేంద్ర, హెచ్.సి.ఎల్, జొమోటో తదితర కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

పారదర్శకంగా బదిలీల ప్రక్రియ

నెల్లూరు(బారకాసు): సచివాలయ కార్యదర్శుల బదిలీల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో సచివాలయ కార్యదర్శుల బదిలీల ప్రక్రియను గురువారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నెల్లూరు నగరపాలక సంస్థ, మునిపాలిటీలు, నగర పంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న వార్డు సచివాలయ కార్యదర్శుల ఆన్‌లైన్ అభ్యర్థన మేరకు బదిలీల ప్రక్రియను నిర్వహిస్తున్నామని చెప్పారు. నిర్దేశించిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌ను తప్పక పాటించాలని సూచించారు. 2019 / 20 వార్డు సచివాలయ సెక్రటరీల నియామకం, ర్యాంక్, మార్కుల ప్రాధాన్యం మేరకు బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్పొరేషన్ అధికారులు, ఇతర పురపాలక సంఘాల కమిషనర్లు, నగర పంచాయతీలను సమన్వయం చేసుకొని సజావుగా నిర్వహించాలని కోరారు.

108లో ఈఎంటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(అర్బన్): జిల్లాలోని 108 వాహనాల్లో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఈఎంటీ) పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని 108, 104 వాహనాల జిల్లా మేనేజర్ పవన్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మనుబోలు, తోటపల్లిగూడూరు, సంగం, బుచ్చిరెడ్డిపాళెం, చేజర్ల, పొదలకూరు, వలేటివారిపాళెం, ఉలవపాడు, కావలి, అల్లూరు, కొడవలూరు, తదితర మండలాల్లో ఈఎంటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ లైఫ్ సైనెన్సెస్, ఐదేళ్ల అనుభవంతో కూడిన క్యాథ్‌ల్యాబ్, డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, అనస్థీషియా టెక్నీషియన్, తదితర కోర్సులు చేసిన వారు అర్హులని చెప్పారు. ఆసక్తి గల వారు సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో గల 108 కార్యాలయంలో దరఖాస్తులను ఈ నెల 20లోపు అందజేయాలని కోరారు. వివరాలకు 87900 69434 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో డ్రైవర్ల పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు(అర్బన్): నెల్లూరు సిటీ, కావలి, కందుకూరు పరిధిలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ 102 వాహనాల్లో ఖాళీగా ఉన్న డ్రైవర్ పోస్టులను భర్తీ చేయనున్నామని వాహనాల జిల్లా మేనేజర్ వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై మినిమమ్ బ్యాడ్జి / హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న వారు అర్హులని చెప్పారు. ఆసక్తి గల అభ్యర్థులు సంబంధిత డాక్యుమెంట్లతో జీజీహెచ్ ఆవరణలోని తమ కార్యాలయాన్ని శనివారంలోపు సంప్రదించాలని కోరారు. వివరాలకు 90007 44043 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

కూలీల సంఖ్యను పెంచండి

నెల్లూరు(పొగతోట): ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచాలని డ్వామా పీడీ వెంకట్రావ్ ఆదేశించారు. డ్వామా కార్యాలయం నుంచి వివిధ మండలాల అధికారులతో గురువారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందేలా పనులను గుర్తించి వాటిని కూలీలతో చేయించాలని సూచించారు. కూలీలకు రోజుకు రూ.250 వేతనం తగ్గకుండా చూడాలని చెప్పారు. పనులకు సంబంధించిన వివరాలను సేకరించి ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కూలీలకు సకాలంలో వేతనాలు వారి బ్యాంక్ ఖాతాల్లో జమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి పనుల అమల్లో అక్రమాలకు పాల్పడే సిబ్బందిపై కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ప్లాంటేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

యోగా దినోత్సవ విజయవంతానికి పిలుపు

నెల్లూరు(అర్బన్): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గల ఇండోర్ స్టేడియంలో ఈ నెల 21న నిర్వహించనున్న ప్రపంచ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయుష్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ గోవిందయ్య పిలుపునిచ్చారు. మూలాపేటలో ఆయుష్ డాక్టర్లతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 6.30 నుంచి 8.30 వరకు కార్యక్రమాలను నిర్వహించనున్నామని వివరించారు. జిల్లా అధికారులు, యోగా గురువులు, ప్రజలు హాజరుకావాలని కోరారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


అర్జీదారులతో మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరు: ప్రజా సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని, ఇబ్బందులు ఉంటే వాటిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అందిన అర్జీలను మంత్రి పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పక్కా ఇళ్ల నిర్మాణం వేగవంతంగా జరగాలని, నియమ నిబంధనలను లబ్ధిదారులకు వివరించి సరిచేసుకోవాలని సూచించాలన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని తెలిపారు. మండలంలో అన్ని గ్రామాలకు సంబంధించి నిరుపేదలకు భూములను పంపిణీ చేసేందుకు అధికారులు జాబితాలను సిద్ధం చేయాలని సూచించారు. మండల స్థాయి అధికారులే క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. వీఆర్వోలు గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేస్తున్నట్లు ప్రజలు తన దృష్టికి తెస్తున్నారని, ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, హౌసింగ్ శాఖల పనితీరుపై మంత్రి సమీక్షించారు. ఈ సమీక్షలో ఇన్‌చార్జి ఎంపీడీఓ నరసింహారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ గణేష్ సాయి, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఏఈలు శివమోహన్‌రెడ్డి, కె.కసనానాయక్, ప్రసాద్, విద్యుత్ ఏడీఈ సురేంద్రబాబు, వైద్యాధికారి డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోండి


రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

మనుబోలు: భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు వినియోగించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ బాల కోటమ్మ సూచించారు. మండలంలోని జట్ల కొండూరు సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. వివిధ సమస్యలపై రైతులు రెవెన్యూ అధికారులకు అర్జీలు అందజేశారు. అర్జీల్లో తెలిపిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శివప్రసాద్, వీఆర్ఓ అఖిల్, ఉప సర్పంచ్ ఆవుల తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక


మంత్రి కాకాణి సమక్షంలో పార్టీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

పొదలకూరు: మండలంలోని మొగళ్లూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో గ్రామానికి చెందిన 10 కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డిచర్ల అంకిరెడ్డి, పలుకూరు పెంచలనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, నాయకులు యనమల శ్రీనివాసులురెడ్డి, ఆకుల చినగంగిరెడ్డి, గజ్జెల శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి చిన్నారినీ అంగన్‌వాడీ కేంద్రంలో చేర్చాలి


అంగన్‌వాడీ కేంద్రంలో చేర్చిన పిల్లలు

బుచ్చిరెడ్డిపాళెం: మూడేళ్లు వయస్సు నిండిన ప్రతి చిన్నారినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలని సూపర్‌వైజర్ శకుంతలమ్మ సూచించారు. స్థానిక ఖాజానగర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జన భాగీదారి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చడంతోపాటు వారికి ఆటపాటలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యమని తెలిపారు. అలాగే ప్రతి చిన్నారికీ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించనున్నట్లు తెలిపారు. అనంతరం చిన్నారుల తల్లులతో ముగ్గులు, అంకెలు, అక్షరాలను రాయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మలత, హబీబున్నీసా పాల్గొన్నారు.

సేవలు అభినందనీయం


మజ్జిగ పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మనుబోలు: ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నారపరెడ్డి కిరణ్‌రెడ్డి చేస్తున్న సేవలు అభినందనీయమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, నెడ్‌క్యాప్ డైరెక్టర్ దాసరి భాస్కర్‌గౌడ్ పేర్కొన్నారు. గత 50 రోజులుగా మనుబోలు కేఆర్‌పురం వైఎస్సార్ సర్కిల్ వద్ద మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసిన క్రమంలో గురువారం ముగింపు సందర్భంగా వారు మాట్లాడారు. తన తండ్రి పేరుతో ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్‌ను స్థాపించిన కిరణ్ తన సొంతూరు అక్కంపేటతోపాటు ఇతర ప్రాంతాల్లో సైతం ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. 50 రోజులపాటు సుమారు రూ.2 లక్షలు వెచ్చించి మజ్జిగ చలివేంద్రం నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అనమాల ప్రభాకర్‌రెడ్డి, మహేంద్ర వర్మ, సుధాకర్‌రెడ్డి, కోటేశ్వరగౌడ్, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్నకు చెబుదాం’పై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ హరినారాయణన్


సమావేశంలో పాల్గొన్న అధికారులు

నెల్లూరు(దర్గామిట్ట): ‘జగనన్నకు చెబుదాం’పై ప్రత్యేక దృష్టి సారించాలి. దరఖాస్తుల పరిష్కార క్రమంలో మరింత మెరుగైన విధానాన్ని అవలంబించేందుకు చర్యలు తీసుకోవాలి.’ అని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై గురువారం సాయంత్రం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తులు సచివాలయ పరిధిలోనే ఎందుకు పరిష్కారం కావడం లేదో తెలుసుకునే మెకానిజంను అభివృద్ధి చేయాలన్నారు. జగనన్నకు చెబుదాంలో వచ్చే సమస్యల పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేయడంలో జెడ్పీ సీఈఓ చిరంజీవి సమర్థవంతంగా పనిచేస్తున్నారని అభినందిస్తూనే మరింత మెరుగ్గా నిర్వహించడానికి వినూత్న ఆలోచన చేయాలన్నారు. సమస్య మూలాల్లోకి వెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ, పోలీస్ శాఖలో అనుసరిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ట్రెయినీ కలెక్టర్ విద్యాధరి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీఎల్‌డీఓ వసుమతి, సీపీఓ రాజు, డీఎస్పీ శివాజీ తదితరులు పాల్గొన్నారు.

‘డీకేడబ్ల్యూ’లో ఈ నెల 19 నుంచి అడ్మిషన్లు

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ల ప్రక్రియను ఈ నెల 19 నుంచి ప్రారంభించనున్నామని ప్రిన్సిపల్ గిరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి బీఏ హానర్స్ (హిస్టరీ, ఎకనమిక్స్, పొలిటికల్ సైన్స్, స్పెషల్ తెలుగు, ఇంగ్లిష్, స్టాటిస్టిక్స్ – నాన్ మ్యాథ్స్), బీకాం హానర్స్ (బీకాం జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్, బ్యాంకింగ్ అండ్ ఇన్సూరెన్స్), బీఎస్సీ హానర్స్ (మ్యాథమేటిక్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, జువాలజీ, బయోటెక్నాలజీ, ఆక్వాకల్చర్, బొటనీ, హోమ్ సైన్స్, కెమిస్ట్రీ), తదితర కోర్సులను ప్రవేశపెట్టామని చెప్పారు. అడ్మిషన్లకు సంబంధించిన వివరాలకు 86397 34668 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మంత్రి కాకాణి పరామర్శ

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు డబ్బుగుంట వెంకటేశ్వర్లుయాదవ్(48) గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కాకుటూరుకు వెళ్లి వెంకటేశ్వర్లుయాదవ్ మృతదేహానికి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మండల వెంకటశేషయ్య, కుంకాల ఏడుకొండలు, అనిల్‌కుమార్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

సంతాపం

ముత్తుకూరు: మండలంలోని వరిగొండ పంచాయతీకి చెందిన అద్దంకి రామ్మూర్తి(80) అనారోగ్యం వల్ల గురువారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి వరిగొండ గ్రామానికి వెళ్లి రామ్మూర్తి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

వెంకటాచలం: విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడంపై ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులకు రాజీవ్‌గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో గురువారం ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చారు. వెంకటాచలం మండలం కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి 30 మంది ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ డెవలప్‌మెంట్ ఆచార్యులు వాసంతి రాజేంద్రన్, వీఎస్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, వీఎస్‌యూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్, డాక్టర్ సునీత, డా.డేవిడ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి పంచాయతీలకు ఆదాయం

మనుబోలు: గ్రామాల్లో నిర్వహిస్తున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల(ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ల) ద్వారా పంచాయతీలు ఆదాయాన్ని సమకూర్చుకోవాలని పంచాయతీ విస్తరణాధికారి ప్రసాద్ తెలిపారు. మండలంలోని చెరుకుమూడి, కొమ్మలపూడి గ్రామాల్లో గురువారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. రోడ్ల పక్కనున్న చెత్త చెదారాలను తొలగించి సంపద తయారీ కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లలో ప్రతి రోజూ పేరుకుపోయే చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందజేయాలన్నారు. పంచాయతీ సిబ్బంది దాన్ని సంపద కేంద్రాలకు తరలించి వర్మీకంపోస్టు ఎరువు తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకుడు కరీముల్లా ఉన్నారు.

వెంకన్నపురం విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

కొడవలూరు: మండలంలోని వెంకన్నపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఎస్.మోక్షిత, పి.కౌషిద్య గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి గురుకులంలో సీట్లు సాధించారు. వీరిద్దరూ బుచ్చిరెడ్డిపాళెం మండలం రామచంద్రాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి సీట్లు సాధించారు. వీరిని ఎంఈఓ జి.వసంత కుమారి, హెచ్‌ఎం తాటిపర్తి వెంకటేశ్వర్లు గురువారం అభినందించారు.

తక్కువ నీటి వినియోగంతో పంటల సాగు


మాట్లాడుతున్న శాస్త్రవేత్త వెంకటేశ్వర్లు

పొదలకూరు: రైతులు తక్కువ నీటి వినియోగంతో చిరుధాన్యాల పంటలను సాగు చేసుకోవాలని పొదలకూరు చిరుధాన్య పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త ఒ.వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక పరిశోధనా స్థానం సమావేశ మందిరంలో గురువారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో పొదలకూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని వీఏఏలు, వీహెచ్ఏలు, వీఎస్ఏలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాదిని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించిందని తెలిపారు. చిరుధాన్యాల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయని, వీటిని సాగు చేయడం ద్వారా భూమిలో వృద్ధి చెందే అనేక రకాల పురుగులను నివారించవచ్చని తెలిపారు. జిల్లా శిక్షణ సమన్వయకర్త సత్యవాణి మాట్లాడుతూ గ్రామాల్లో పొలంబడి కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించి రైతులకు సాంకేతిక వ్యవసాయంపై అవగాహన పెంపొందించాలని సూచించారు. పొలంబడి కార్యక్రమాల్లో వ్యవసాయ ఖర్చులు తగ్గించుకోవడం, మిత్రపురుగులు, మందుల పిచికారీ, పర్యావరణ పరిరక్షణ తదితర అంశాలను వివరించాలని తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీమాధవి మాట్లాడుతూ భూసార పరీక్షలు, ఉపయోగాలు, భూసార పరీక్షలకు అనుగుణంగా ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పొదలకూరు ఏడీఏ కె.శివనాయక్ మాట్లాడుతూ ఈ–క్రాప్ బుకింగ్ ఉపయోగాలు, ఈకేవైసీ చేయించుకోవడం, ప్రభుత్వం వ్యవసాయరంగానికి అందిస్తున్న రాయితీలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఓ ఈ.ఆనంద్, పొదలకూరు ఏఓ ఎ.వాసు, కలువాయి, చేజర్ల, రాపూరు, మనుబోలు ఏఓలు పాల్గొన్నారు.

నీట్‌లో సత్తా చాటిన బుచ్చి విద్యార్థి

- ఆల్ ఇండియాలో 1,244 ర్యాంకు
- ఏపీ ఈఏపీ సెట్‌లో 93వ ర్యాంకు


తల్లి, సోదరీమణులతో హేమంత్‌రెడ్డి(ఫైల్)

బుచ్చిరెడ్డిపాళెం: నగర పంచాయతీ బుచ్చిరెడ్డిపాళెం పరిధిలోని బైపాస్ రోడ్డులో నివాసం ఉంటున్న బొడ్డు హేమంత్‌రెడ్డి మంగళవారం విడుదల చేసిన నీట్ యూజీ ప్రవేశ ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో 1,244 ర్యాంకు సాధించి సత్తా చాటాడు. హేమంత్‌రెడ్డి 720 మార్కులకు గాను 685 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచాడు. హేమంత్‌రెడ్డి ప్రాథమిక విద్యను బుచ్చిరెడ్డిపాళెంలోని రత్నం ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో, 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు విజయవాడలోని శ్రీచైతన్య కళాశాలలో చదివాడు. తన తండ్రి చిన్నతనంలోనే మృతిచెందినప్పటికీ తల్లి సౌజన్య తనతోపాటు తన ఇద్దరు సోదరీమణులను కష్టపడి చదివిస్తున్నట్లు హేమంత్‌రెడ్డి తెలిపారు. తన పెద్ద సోదరి సుమశ్రీ తిరుపతిలోని శ్రీవెంకటేశ్వర మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ఫైనలియర్ చదువుతుండగా, మరో సోదరి దివ్యశ్రీ సీఏ ఫైనలియర్ చేస్తున్నట్లు తెలిపారు. తాను నీట్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 1,244 ర్యాంకును సాధించగా, ఏపీ ఈఏపీ సెట్‌లో 93వ ర్యాంకు, తెలంగాణ ఎంసెట్‌లో 111 ర్యాంకు సాధించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో న్యూరాలజిస్ట్‌గా పేదలకు నాణ్యమైన వైద్యసేవలను అందించాలనుకుంటున్నట్లు హేమంత్‌రెడ్డి తెలిపారు.

జగనన్న విద్యాకానుక విద్యార్థులకు వరం


విద్యాకానుక అందుకున్న విద్యార్థులు

కొడవలూరు: సర్కారు బడుల్లో చదువుతున్న పేద విద్యార్థులకు జగనన్న విద్యాకానుక వరమని వైఎస్సార్‌సీపీ నాయకుడు అడపాల మోహనకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని గండవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఆయన చేతులమీదుగా జగనన్న విద్యాకానుక పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రామిరెడ్డి రాజేష్‌రెడ్డి, హిందీ పండిట్ జి.నాగభూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గాంధీ ఆశ్రమాన్ని సందర్శించడం ఆనందంగా ఉంది

- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దుష్యంత్ కుమార్ గౌతమ్


పొణకా కనకమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దుష్యంత్ కుమార్ గౌతమ్

ఇందుకూరుపేట: మహాత్ముడు నడియాడిన నేల ఇందుకూరుపేట మండలంలోని పల్లిపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమాన్ని సందర్శించడం ఆనందంగా ఉందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ దుష్యంత్ కుమార్ గౌతమ్ అన్నారు. గురువారం ఆయన పల్లిపాడులోని ఆశ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ స్త్రీలు గర్వపడే స్వతంత్ర సమరయోధురాలు పొణకా కనకమ్మ జీవిత చరిత్రను తెలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం స్త్రీల కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్ర మహిళా మోర్చ అధ్యక్షురాలు నిర్మలా కిషోర్ మాట్లాడుతూ స్త్రీజాతి తలఎత్తుకొని నడిచేలా భరోసా కల్పిస్తూ ప్రధాని నరేంద్రమోదీ పాలన సాగిస్తున్నారని తెలిపారు. అనంతరం ఆశ్రమ అభివృద్ధికి సహకరించాలని ఆశ్రమ కోకన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్, డైట్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కందికట్టు రాజేశ్వరి, కోర్ కమిటీ సభ్యుడు జీవి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1100 ఎకరాల్లో రెండో పంట


బ్రహ్మదేవిలో వరి నాట్లు వేస్తున్న దృశ్యం

ముత్తుకూరు: పొరుదల కాలువల ద్వారా సమృద్ధిగా సాగునీరు అందడంతో మండలంలో రెండో పంట వరి సాగు ముమ్మరంగా జరుగుతోంది. అయితే, విపరీతమైన ఎండలకు వరి నాట్లు మందకొడిగా సాగుతున్నాయి. రెండో పంటకు సంబంధించి ప్రస్తుతం 1,100 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి జోత్స్నరాణి గురువారం తెలిపారు. ఈ సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అలాగే, రైతులు దాచేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 110 ఎకరాల్లో శనగ సాగు చేపట్టారు. ముఖ్యంగా నారికేళపల్లి, పిడతాపోలూరు, ఈపూరు, పంటపాళెం ప్రాంతాల్లో శనగ సాగు చేస్తున్నారు.

ఈఎన్‌టీ కుటుంబానికి చేయూత


నగదు అందజేస్తున్న యూనియన్ నాయకులు, 108 సిబ్బంది

మనుబోలు: 108 వాహనంలో ఈఎన్‌టీగా పని చేస్తూ కొంతకాలం క్రితం రైలు ఢీకొని మృతిచెందిన మండలంలోని పిడూరు గ్రామానికి చెందిన చంద్రకిరణ్ కుటుంబానికి 108 సిబ్బంది గురువారం ఆర్థికసాయం అందించారు. 108 వాహనాల్లో పని చేసే పైలెట్లు, ఈఎన్‌టీలు కలిసి రూ.87,500 నగదును 108 ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బల్లి కిరణ్‌కుమార్ చేతులమీదుగా మల్లికార్జున తల్లిదండ్రులకు పిడూరు గ్రామానికి వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు సురేష్, ప్రతినిధులు నాగరాజు, కృష్ణయ్య, సునీల్ పాల్గొన్నారు.